

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**ఊర్మిళ** అత్తవారింటికి వెళ్ళిపోయాక ఇక శేషాచారిగారికి రామచంద్రమే ప్రధాన శిష్యుడూ, బిడ్డా అయ్యాడు.

తెల్లవారుఝామున నిద్ర లేచి మామయ్యతో బాటు ఆలయ పూజావిదానంలో సాయం జేయటమూ, ఆ తర్వాత స్కూలు వెళ్లి చదువు కోవటంలో రోజులు దొర్లి పోతున్నాయి.

"మామయ్యా! ఊర్మిళకి చేసినట్లు నాకూ మీరే మంత్రోపదేశం చెయ్యాలి" అన్నాడోరోజు.

శేషాచారిగారు నవ్వారు.

"అలాగే నాయనా" అన్నారు వాత్సల్యంగా.

మంచిరోజు చూచి అయ్యరుగారి చేత

"చక్రాంకిత నమస్తుభ్యం

ధారణాన్ ముక్తిదోభవ"

అంటూ చక్రాంకితాలు చేయించారు. సాంప్రదాయం ప్రకారం మంత్రోపదేశం జరిగింది.

తానే స్వయంగా మంత్రోపదేశ దీక్ష యిచ్చారు ఆ కుర్రాడికి.

శ్రీనివాసాచారి మాత్రం తనకు చక్రాంకితాలు గానీ, మంత్రోపదేశం గానీ అవసరం లేదని మొరాయించాడు. ఏమీ మాట్లాడలేదు శేషాచారిగారు.

✾✾✾

కాపురానికి వచ్చిన కొత్తల్లో ఓ రోజు ఊర్మిళ అడిగింది రామానుజాన్ని.

"ఆరోజు పెళ్ళిచూపులలో సీతక్కని బాగా చూశారు కదా! ఆమె నాకంటే ఎంతో బావుంటుంది కూడాను. మరి నన్ను పెళ్లాడతానంటూ కోరారేమిటి?" అని.

రామానుజం నవ్వాడు.

"మీ సీతక్క దగ్గర యెంత అందం వుందో, అంత అహమూ వుందని ఇట్టే అర్ధమయింది. నాక్కావలసింది మా పెద్ద సంసారంలో ఓర్పుగా సర్దుకు పోయే నీలాటి ఇల్లాలు. అదీగాక..." ఏదో చెప్పబోయి ఆగిపోయాడు రామానుజం.

"అదీగాక?" ఆశ్చర్యంగా అడిగింది ఊర్మిళ.

"ఏం లేదు" అని తప్పుకున్నాడు. మాట మార్చేశాడు.

కానీ అతగాడు మనసులోనే అనుకున్నాడు. 'లక్ష రూపాయల విలువ చేసే మీ నాన్నగారి ఆస్తి వుంది నీ వెనకాల. సీతకేముందని? నువ్వు ఛామనఛాయలో వున్నా నీ డబ్బు నీకు ఎనలేని సౌందర్యాన్ని ఇచ్చింది నా దృష్టిలో.' ఈ సమాధానం ఊర్మిళ కతగాడు చెప్పలేదు.

ఊర్మిళ కాపురానికి వచ్చే ముందు అనసూయమ్మ ముభావంగా జాగ్రత్తలు చెప్పింది లోకం కోసం.

శేషాచారిగారు మాత్రం స్టేషనుకొచ్చి ట్రెయిన్ కదిలేవరకూ చెప్పారు.

"చూడమ్మా ఊర్మిళా! మీ నాన్నా అమ్మా వుండి వుంటే ఏం చెప్పేవారో నాకు తెలియదు గాని నేను నాకు తెలిసినంత వరకూ వో విషయం చెబుతున్నాను, గుర్తుంచుకో. నీ భర్తలోనే తల్లినీ, తండ్రినీ, దైవాన్నీ చూడటం అలవరచుకో.

ఎప్పుడేనా ఈ పెదనాన్నను చూడాలనిపిస్తే వచ్చి వెళ్ళు. మీ పెద్దమ్మ నుంచి ఎక్కువ ఆత్మీయతని ఇకపై ఆశించకు. నిరాశపడతావు. రామచంద్రం నీ తోబుట్టువు కంటే ఎక్కువైనవాడు. కష్టంలో, సుఖంలో వాడు నీకు చేయూత ఇవ్వగలడని నా నమ్మకం. నేను బోధించిన మంత్రాన్ని ఏమరక మననం చేసుకుంటూ వుండు."

తలూపింది ఊర్మిళ. ఆమె కళ్ళ నిండుగా కన్నీళ్లు కమ్ముకు వచ్చాయి.

ఆ ఏడాదే సీత పెళ్లి కూడా జరిగింది. సీత భర్త నరసింహాచారి కూడా హైదరాబాదులో వో ఇంజనీరు ఆఫీసులో గుమాస్తా. అతగాడికి తల్లిదండ్రి లేరు. మేనమామ పెంచి పెద్ద చేసాడు. సీత అందం చూసి ముగ్ధుడైన నరసింహం పైసా కట్నం వద్దని సీతే చాలునని చెప్పాడు. ఆ మాత్రం గొప్పతనం తనకూ, తన కూతురుకీ దక్కినందుకు సంతోషించింది అనసూయమ్మ.

సీతకూడా భర్త వెంట హైదరాబాదు వచ్చేసింది. అయితే సీతా వాళ్ళుండేది హైదరాబాదులో. ఊర్మిళా వాళ్ళిల్లు సికిందరాబాదులో. పదిహేను రోజులకో, నెల రోజులకో తప్ప ఒకరినొకరు కలుసుకునే వీలుండేది కాదు.

కాలప్రవాహంలో పన్నెండేళ్ళు గిర్రున తిరిగి పోయాయి. జరుగుతున్న ప్రతి నిమిషమూ 'గతం' గా మారిపోయే కాలప్రవాహంలో పన్నెండేళ్ళ కాలవ్యవధి ప్రతి వ్యక్తి జీవితంలోనూ అనేకానేక మార్పులనూ చేర్పులనూ తేవటంలో ఆశ్చర్యం లేదు.

ఊర్మిళ భర్త రామానుజం స్వబావసిద్ధంగా మంచి వాడే. అతగాడికి ఊర్మిళన్నా, ఊర్మిళ ఆస్తి అన్నా చాలా ప్రేమ ఏర్పడ్డాయి మొదట్లో. తర్వాత రాను రాను ఊర్మిళ తాలూకు డబ్బుతో అతగాడికి విలాసాల పట్ల మోజు పెరగటం ప్రారంభించింది.

సుభద్రమ్మ చాలా తెలివిగలది. ఊర్మిళను కోడలుగా గాక, "నువ్వు నాకు మరో కూతురివమ్మా" అంటూ అతి ప్రేమగా చూచుకునేది.

ఊర్మిళ చేతే చెప్పించి మాలతి పెళ్ళికి ఊర్మిళ తాలూకు పదిహేనువేలూ ఖర్చు పెట్టించింది.

ఊర్మిళ ఇంటి మీద వచ్చే బాడుగ రామానుజం వాడుకునే వాడు.

మెల్లిగా ఇల్లు బేరం పెట్టించి లక్షా ఇరవై వేలకు అమ్మించి, సంవత్సరం రోజులు ఊర్మిళ పేరిట ఆ డబ్బు ఫిక్స్ డ్ డిపాజిట్ లో ఉంచింది. ఆ తర్వాత మెల్లిగా పై ఇరవై వేలు డ్రా చేయించి భారతి పెళ్లి జరిపించేసింది. ఆడపిల్లల బాధ్యత

వదిలి పోయాక మిగిలి వున్న లక్ష రూపాయలలో డెబ్బై ఐదు వేలకి అన్ని వసతులూ గల వో యిల్లు కొనిపించింది కొడుకు చేత సికిందరాబాడులోనే. ఆ వెంటనే అందులోకి అవసరమైన ఫర్నిచర్ వగైరాలంతా భారీ ఎత్తున కొన్నాడు రామానుజం.

అతగాడి ఇల్లు చూస్తే ఓ గుమాస్తా ఇల్లులా గాక గవర్నర్ ఇల్లంత అట్టహాసంగా కనిపిస్తుంది వస్తుసామగ్రి. పదిహేనువేల రూపాయలు తన పేరుతో బ్యాంకిలో వేసేసుకున్నాడు రామానుజం.

ఇప్పుడు ఆస్తి మైనస్ ఊర్మిళ మిగిలిపోయింది. సుభద్రమ్మకు ఇప్పుడు కోడలు కూతురులా గాక కోడలుగానే కనిపించటం మొదలయింది.

మాలతిని పల్లెటూరి సంబంధానికి ఇచ్చారు. ఉమ్మడి కుటుంబం. వ్యవసాయం వుంది. మాలతి భర్త రాఘవాచారికి ఉద్యోగాల మీద మోజు లేదు. గ్రామంలో తమ భూములు చూచుకుంటూ గ్రామంలోనే వున్న రామాలయంలో పూజారిగా వున్నాడు.

చదవటానికి అతగాడు డిగ్రీ చదివాడు. పెళ్లి నాటికి సుభద్రమ్మ అల్లుడు ఆ గ్రామంలో ఉండడనీ, ఏదో వో ఉద్యోగం చేసుకుంటాడని ఊహించింది. తీరా అతగాడు గ్రామంలోనే స్థిరపడి పోయేసరికి ఆమె హతాశురాలై పోయింది.

ఇద్దరు మరదులూ, ఇద్దరాడబిడ్డలూ, అత్తగారు, మామగార్ల మధ్య తన కూతురు మాలతి చాకిరీ చేయాల్సి వస్తుందని హడలి పోయింది.

గోమతి, సుమతి, భారతిల కంటే మాలతి అందంగా వుంటుంది. రాఘవాచారిక్కూడా తన భార్య తనకంటే అందగత్తె అనీ, కాస్త నల్లగా వుండే తాను ఆమెకు తగననీ వో ఆత్మన్యూనతాభావం వుంది లోలోపల.

“చూడు నాయనా రాఘవా! మాలతి చాలా సుకుమారి. అది పెరిగేనాటికి మేం బస్తీకి వచ్చేశామా. పల్లెటూరి వాసనకూడా తెలీకుండా పెంచాము. పల్లెటూరి చాకిరీ అది చెయ్యలేదు. అందునా ఉమ్మడి కుటుంబం! అంచేత నువ్వే వీలు చూచుకుని అప్పుడప్పుడు వస్తూ వుండు. అమ్మాయి మా దగ్గరే వుంటుంది” అంది సుభద్రమ్మ, మాలతి పెళ్ళయ్యాక, ఓ సంవత్సరం నిండాకా.

రాఘవాచారి ‘కాదు’ అనలేక పోయాడు,

ఫలితంగా మాలతి ఎప్పుడూ పుట్టింటిలోనే వుండిపోయి, అప్పుడప్పుడూ ‘మార్పు’ కోసం అన్నట్లు భర్త వుండే గ్రామానికి వెళ్లి పదిరోజులుండి వస్తుంది.

ఇద్దరు పిల్లలు కలిగారు. బాబు, పాప. వాళ్ళు పెరుగుతున్నారు.

మాలతి ఇక్కడే ఉండిపోయింది. ఆ అమ్మాయికి తగని సుకుమారం. తగని బద్ధకం.

ఆ పిల్లలిద్దరి ఆలనా పాలనా అంతా ఊర్మిళే చూచుకోవాలి. ఇంట్లో వంటా వార్పూ ఊర్మిళే చూసుకుంటుంది. మాలతి ట్రిమ్ గా డ్రెస్ చేసుకుని, వీలయినంతవరకూ స్నేహితురాళ్ళ ఇళ్ళలోనూ, సినిమాల కాలక్షేపంలోనూ గడిపేస్తుంటుంది.

సీత హైదరాబాదు చేరుకున్నాక సీతకూ, మాలతికీ తగని స్నేహం ఏర్పడింది. ఎక్కడికి వెళ్ళినా జంటగా వెళతారు. ఊరంతా బలాదూరు తిరిగి వస్తుంటారు. ఎక్కడ ఉద్యమం జరుగుతున్నా అది తిలకించే ప్రేక్షకులలో సీత, మాలతి తప్పనిసరిగా వుంటారు. ఎక్కడ సాంస్కృతిక కార్యక్రమం జరుగుతున్నా మాలతి, సీత తప్పని సరిగా హాజరౌతారు. ఏ సినిమా శతదినోత్సవ సభ జరిగినా, ఏ మంత్రి పుంగవుడి ఉపన్యాసం వున్నా అక్కడ వాళ్ళిద్దరూ ప్రత్యక్షం అవుతారు. సిటీలో రోజూ ఏదో వో చోట యెన్నో కార్యక్రమాలు జరుగుతూనే వుంటాయి. అంచేత మాలతికీ సీతకీ ఇంటిపట్టున ఉండాల్సిన అవసరమే కనిపించటం లేదు.

మాలతికి ఇంట్లో అమ్మ, వదిన వున్నారు. పేరుకి పిల్లల్ని కన్నది అంతే! పిల్లల పనులన్నీ అమ్మ, వదిన చూచుకోవాల్సిందే. వాళ్లకి తల్లి కంటే అమ్మమ్మ దగ్గరా, అత్త దగ్గరా చనువు ఎక్కువ.

భర్త రాఘవాచారి నెలకోసారి సిటీకి వస్తాడు. రెండు రోజులుండి వెళతాడు. ఆ రెండు రోజుల్లోనూ మాలతి అతగాడి వెంట సినిమాలకు వెళుతుంది. ఉమ్మడి కుటుంబంలో భర్త తాలూకు అయివేజు, లెక్క తేల్చమన్నట్లు మాట్లాడి, “అన్నయ్య మావాడయితే, వదిన మా మనిషి అవుతుందా? ఇక్కడ నన్ను, నా పిల్లల్ని మా అమ్మ ఎంత జాగ్రత్తగా చూచుకుంటుందో చూడండి. నా ఖర్చులకయినా నాకు మీరు డబ్బివ్వకపోతే ఎలా?” అని మూడువందల రూపాయలు ముక్కు పిండి వసూలు చేసుకుంటుంది.

తన సహధర్మచారిణిగా ఏ బాధ్యతలూ నిర్వర్తించకుండానే, కష్ట సుఖాలలో ఏ విధంగానూ పాలుపంచుకోకుండానే, ఇలా తన సంపాదనలో మాత్రం హక్కు కోరే ఈ స్త్రీ సాధారణ వ్యభిచారిణి కంటే అధమురాలనీ, వ్యభిచారిణి తన పొట్టకూటి కోసం హేయమైన వృత్తి ఎన్నుకొంటే, మాలతి లాటి స్త్రీలు, భర్త లోని ఒకానొక బలహీనత ఆధారంగా, తమ స్వార్ధం, స్వసుఖం చూచుకుంటారనీ ఆలోచించగల వివేకం రాఘవకు లేదు.

ఇక సీత, నరసింహంల సంసారం మరో రకంగా వుంది. సీత అద్భుత అందం పట్ల వ్యామోహమే గాక, ఆమెకు ఏ విషయంలోనూ ఎదురు చెప్పగల సాహసం లేదు. అది తెలుసుకున్న సీత కొద్దికాలంలో భర్తని కేవలం బొమ్మను చేసి, తనెలా తిరిగినా, ఏం చేసినా ఏమీ అనలేని స్థితికి లాగి వేసింది.

తమ్ముడు శ్రీనివాసాచారినీ, తల్లి అనసూయమ్మనీ తరచూ తన దగ్గరకు పిలిపించుక అట్టే పెట్టుకుంటుంది. అల్లుడిలోని బలహీనత అర్థం చేసుకున్న అనసూయమ్మకీ ఇల్లు స్వర్గంగా వుంది. శ్రీనివాసాచారికి సిటీ జీవితం మరింత హాయిగా వుంది.

నగరంలో షుమారు అరవై డెబ్బై సినిమాహాళ్ళు వున్నాయి. రోజుకో హాలు పావనం చేసినా తీరిపోతుంది.

మాలతితో సీత ఊర్మిళ మీద ఓపినన్ని చాడీలు చెబుతుంది. అనసూయమ్మ కూడా వీలు చూచుక, రామానుజం ఇంటికి వస్తూ వెళ్తూ సుభద్రమ్మతో ఊర్మిళ మీద అక్కసు వెళ్ళబోసుకుంటుంది.

"అసలు ఈ ఊర్మిళ ఏం కళ్ళు తిప్పిందో, హొయలు ఒలకబోసిందో మాకు తెలీదు. పెళ్ళిచూపుల నాడు మీ అన్నను వలలో వేసేసుకుంది. ఇంత నంగనాచి అని తెలిసి వుంటే ఆరోజు దీన్నసలు ఇంట్లో ఉండనిచ్చే వాళ్ళం కాదు మాలతీ! దీని బుద్ధి తెలుసుకోలేక పోయాం నేను, మా అమ్మ! లేకుంటే ఈ రోజు నేను మీ వదిన స్థానంలో మీ ఇంట్లో ఉండవలసినదాన్ని" అన్నది వో రోజు సీత.

మాలతి సానుభూతిగా అంది. "ఔను సీతా! ఏ విషయంలోనూ ఊర్మిళ నీకంటే గొప్పగా లేదు. అందమా? పాడా? ఆరోజు మా అక్కలిద్దరికీ ఈవిడ పని వైనం నచ్చిందట. చాదస్తులు! నేనే వచ్చి వుంటే పెళ్ళి చూపులకి, నాకానాటికి ఇంత ఊహే వుండి వుంటే నిన్ను తప్ప అన్నయ్యకీ ఊర్మిళను చేసుకోనిచ్చి వుండేదాన్ని కాదు. ఆ మధ్యవర్తి కూడా సరిపోయాడు. ఊర్మిళ అయితే బోలెడంత ఆస్తి వస్తుందని ఆశ పెట్టారు అమ్మకీ, అన్నయ్యకీ. నీతో మాత్రం అదే ఆస్తి వచ్చి వుండేది కాదా, ముందస్తుగా నీ పెళ్ళి జరిగి వుంటే? ఏమిటో తలకాయ లేని మనుషులు."

ఇంక అనసూయమ్మ వాగ్ధోరణి మరీ వింతగా వుంటుంది. సుభద్రమ్మతో, "ఈపాటి పని మా సీత ఎడం చేత్తో చేసి పారేస్తుంది. ఏమిటో ఆరోజు మీరంతా ఊర్మిళ ఊర్మిళ అంటూ కలవరించి పోయారు. రామానుజం ఎర్రగా ఎంత అందంగా ఉంటాడు? అంతగాడి ప్రక్కన ఛామనఛాయలో వుండే ఊర్మిళ ఏమన్నా అందం అనిపిస్తుందా? అదే మా సీత అయి ఉంటేనా? చూచేవాళ్ళ కళ్ళే నిలచిపోక పోయేనా? ఎలాగోలా ఊర్మిళ ఆస్తి సీతకే చెందించేదాన్ని కాదా? అంతా మించి పోయే. ఏం చేస్తాం? రాత!"

సుభద్రమ్మకూ సీతనిప్పుడు తరచూ చూస్తుంటే, తన కోడలి అనాకారితనం మరింతగా పెరిగినట్లు అనిపిస్తోంది.

అనసూయమ్మగానీ, సీతగానీ వచ్చి వెళ్ళినరోజు ఇక ఊర్మిళకు ఆ యింట్లో శాంతి వుండదు.

రామానుజం చీటికీ మాటికీ విసుక్కుంటాడు, కారణం లేకుండానే. సుభద్రమ్మ అయినదానికీ, కానిదానికీ సణుక్కుంటూ ఉంటుంది. మాలతి సరేసరి! అత్తింటి కాపురం రుచి ఏమాత్రం తెలియని మాలతి ఊర్మిళని సాధించటంలో పురాణకాలపు ఆడబిడ్డల్ని, విధవాడపడుచుల్నీ మించిపోయింది. ఏ సతీ సక్కుబాయి, తిరపతమ్మ కథలోని ఆడపడుచో తిరిగి మాలతి రూపంలో జన్మించిందేమో అనిపించేటట్లు ఉందామె ధోరణి.

అలాటి రోజు ఊర్మిళ చాలా ఆలోచిస్తూ వుండి పోతుంది.

స్త్రీయే స్త్రీకి శత్రువా? భర్త యిచ్చే ప్రేమని దుర్వినియోగం చేసుకునే సీత, మాలతి లాటి స్త్రీలు... స్త్రీలుగా తమ బాధ్యతల్ని విస్మరించి, ఓ విధమైన విశృంఖలతకి అలవాటు పడతారా? వాళ్ళ 'తీరిక టైం' అంతా ఇతర స్త్రీలు, ముఖ్యంగా తనలాగా తమపని తాము చేసుకుపోయే స్త్రీలను తప్పులు ఎన్నటంలోనూ, వాళ్ళ జీవితాలలో జోక్యం చేసుక ఏడిపించి, వారు బాధలు పడుతుంటే, తాము ఆనందించే ఒకానొక సాడిస్ట్ మనస్తత్వం పెంపొందించు కొనేందుకు వినియోగిస్తారా? వీరి అందం ఒక్కటే వీరికున్న క్వాలిఫికేషనా? దానికి బానిసలైన ఆ భర్తల్ని పురుగులుగా చూస్తారా?

ఇక అనసూయమ్మ పెద్దమ్మలాటి వారికి... దైవసమానుడైన శేషాచారి పెదనాన్నలాటి భర్త మీద గౌరవం, భక్తి మాటలా వుంచి ఓ విధమైన నిర్లక్ష్యమూ, చులకనా ఏర్పడతాయా? ఆయననీ వయసులో ఒంటరిగా వదిలి వంటావార్పూ ఆయన మీదే వేసి, తాను మాత్రం కూతురి ఇంట్లో మకాం పెట్టేసింది. అల్లుడి బలహీనత ఆసరా చెసుక, తన 'గుండెజబ్బు' ను వెయ్యిరెట్లుగా పెంచి అస్తమానూ మందులు తీసుకుంటూ, ఆయాసపడుతూ సాగించుకుంటోంది.

ఇలాటి స్త్రీలలోని చైతన్యం కేవలం ఇతరులను హింసించేందుకేనా?

పదేళ్లుగా మాలతి పుట్టింటిలోనే తన హక్కుగా ఉండిపోయింది పిల్లలతో. సీత నరసింహం బావని వెర్రివాణ్ణి చేసి ఆడిస్తోంది.

చదువు సాకుతో బలాదూరు తిరుగుతున్న శ్రీనివాసాన్ని అనసూయమ్మ అదుపులో పెట్టక పోవటం అలా ఉంచి సీత ఆటకు తాళం వేస్తోంది.

ఇదే కాబోలు పెదనాన్న ఓసారి అన్నారు మాటల సందర్భంలో.

"ఊర్మిళా! ప్రతి స్త్రీలోనూ రెండు దశలుంటాయి. చైతన్యమూ, చైతన్య రాహిత్యమూ! ఆ స్త్రీలోని చైతన్యం ఏ మార్గంలో వుందో గమనించి పురుషుడామెను సక్రమ మార్గంలో పెట్టగలిగితే, ఆమెలోని ఆ చైతన్యం కుటుంబానికీ,

లోకానికీ కూడా వెలుగునిస్తుంది. అలా చేయకపోతే ఆ చైతన్యమే ఆమెనీ, ఆమె కుటుంబాన్నీ, ఆమె పరిసరాల్ని కూడా సర్వనాశనం చేస్తుంది.

ఇక అత్యధికంగా బాధల పాలైన స్త్రీలలో ఒకానొక నిర్లిప్త భావన పెరిగి, ఆమె మనసుని చైతన్య రాహిత్య స్థితికి తీసుకు వెళ్తుంది. ఆ చైతన్య రాహిత్య స్థితిలోనే ఆమె పిచ్చిది కావటమో, భగవంతున్ని శరణాగతి పొంది మనశ్శాంతికై అన్వేషించటమో చేస్తుంది. అదామె జన్మ సంస్కారాన్ని బట్టి వుంటుంది." అంటూ... అలాటి పెదనాన్న హఠాత్తుగా చనిపోయారు.

ఆయనని తన దగ్గర వచ్చి ఉండమని కోరింది.

"ఒద్దు తల్లీ! ఈ పెన్నా నదీ, పెరుమాళ్ళూ నా హృదయంలో నిలిచి పోయాయి. ఈ సేవలోనే నేను నా శేష జీవితం గడిపి వేస్తాను. మీ పెద్దమ్మ క్కావలసిన సుఖమేదో సీత, శ్రీనివాసు ఇవ్వనీ."

అలాగే ఆయనగారు వైకుంఠ ఏకాదశి రోజున పెరుమాళ్ళు సేవ చేస్తూనే ఒక్క నిముషంలో వచ్చిన గుండెపోటుతో స్వామి పాదాల దగ్గరే వాలిపోయారు. గర్భగుడిలో నుంచి కంగారుగా, ఇతర పూజారులందరూ ఆలయ ప్రాంగణంలోకి పట్టుక వచ్చేసరికే ఆయనగారు వైకుంఠధామం చేరారు. అంతటి అనాయాస, అద్భుత మరణాన్ని చూచి ఆశ్చర్య చకితులయ్యారు అంతా.

టెలిగ్రాంలు చేరాక అనసూయమ్మ, సీత, ఊర్మిళ అంతా వెళ్ళారు. వెళ్ళేసరికే దహన సంస్కారాలు జరిగి పోయాయి.

ఆయనగారు కోరిన చివరి కోరిక... అంతక్రితం సాయంత్రం ఓ పూజారితో యధాలాపంగా అన్నారట.

"నేను మరణించుటయే జరిగితే నా కళేబరాన్ని నా భార్యా బిడ్డలా కోసం గానీ, మరెవరి కోసం గానీ అట్టిపెట్టకండి. నాకున్నది నా స్వామి ఒక్కడే! ఇవన్నీ తగిలించుకున్న బంధాలు! అవే వదిలిపోతాయి" అని.

ఆయనగారి నమ్మిన శిష్యుడు అలాగే చేయించాడు.

రామచంద్రం కంటికి మింటికి ఏకధారగా ఏడ్చాడు.

"ఊర్మిళా! చూశావా మామయ్య! నీకూ, నాకూ జ్ఞానోపదేశం చేశాడు. మనిద్దరికీ గురువాయన.

అస్తమానూ గుండెజబ్బు గుండెజబ్బు అంటూ అందర్నీ ఏడిపిస్తున్న అనసూయమ్మ అత్త చూడు.. గుండ్రాయిలా వుంది. చివరి రోజులలో ఆయనకు కనీసం అన్నం వండి పెట్టే బాధ్యత నుంచి కూడా తప్పుకుని సీతతో వుండి పోయింది.

ఆరోగ్యంగా వుండిన మామయ్య ఒక్క క్షణంలో మరణించారు. నిజానికిలా జబ్బు జబ్బు అని ఆర్భాటం చేసుకునే వాళ్ళు చావరు ఊర్మిళా! తన పక్క వాళ్ళని చంపుతారు అంతే!" అక్కసుతో అన్నాడు.

పెదనాన్న చనిపోయాక చాలా రోజులు ఆ దుఖం విడలేదు ఊర్మిళకి,

ఊరికే ఇంట్లో ఈ మాలతి, మాలతి పిల్లల పన్లు, సుభద్రమ్మ సూటిపోటీ మాటలు, అడపా దడపా సీత రాకపోకలు, ఇలా ఓ రకంగా ఇరుకైన వాతావరణంలో అవే ఆలోచనలతో సతమతమవటం ఇష్టం లేక డిగ్రీ తెచ్చుకుంది, ఊర్మిళ ప్రైవేటుగా చదివి. టైప్ పరీక్షలు పాసైంది.

"రైట్ ఊర్మిళా! నువ్వా వుద్యోగంలో చేరు. హాయిగా యిద్దరం సంపాదించుకుందాం" అన్నాడు రామానుజం.

ఆ రోజు నుంచీ ఊర్మిళ జీవితంలో కొంత మార్పు వచ్చింది. ఇంటి వాతావరణంలో నుంచి బయటపడి, తన తోటి ఉద్యోగినులూ, వారి సమస్యలూ చర్చించటం ఇలా కొంత రిలీఫ్ పొందుతోంది. కానీ ఇంతా బయటా కూడా చాకిరీ ఎక్కువైంది. ఉద్యోగానికి వెళ్ళేవరకూ ఇంట్లో చాకిరి అంతా చేయాలి. సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక కూడా చేయాలి. మాలతి అటు పుల్ల యిటు కదపదు. ఆమె పిల్లల్ని కాన్వెంటుకు తయారు చేసే బాధ్యత ఊర్మిళదే. సుభద్రమ్మ కూడా బాగా సుఖం మరిగింది. ఆమె అస్తమానూ ఓ మంచం మీద పక్క వేసుక పడుకుంటుంది. అనసూయమ్మను చూసి తనుకూడా 'నాకు గుండె జబ్బు గుండె జబ్బు' అంటోంది.

రామచంద్రం డాక్టర్ కోర్సులో చేరాడు. వరంగల్లులో అతగాడి చదువుకి అయ్యే ఖర్చు కేశవరావుగారనే లక్షాధికారి భరిస్తానన్నారు. చదువులో బాగా పైకి వచ్చే విద్యార్థులలో సంవత్సరానికి ఇద్దరు చొప్పున ఆయనగారు విద్యాదానం చేస్తారట. అప్పుడప్పుడూ హైదరాబాదు వస్తాడు. ఊర్మిళంటే అతగాడికి ప్రాణం. ఓ విధంగా ఊర్మిళ, తను అనాధలు. శేషాచారిగారి వాత్సలం అనే మహావృక్షానికి రెండు కొమ్మలు! ఊర్మిళకీ, తనకీ మధ్య షుమారు ఆరేళ్ళ వయసు తేడా వున్నా, ఆ తేడా వాళ్ళిద్దరి మధ్యా ఆత్మీయతకి అడ్డు కాలేదు. వాళ్ళిద్దరూ శేషాచారి శిష్యులు. ప్రాణ స్నేహితులు. వావి వరుసలకు అతీతమైన వాత్సల్యం వారివురి మధ్యా వుంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments